సాక్షి
నిజామాబాద్
శుక్రవారం, 16, మే, 2025



సీడ్ మక్కవైపే మొగ్గు

పసుపులో అంతరపంటగా సీడ్ మక్క సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతుండడంతో వ్యాపారులు ఒప్పందాలు చేసుకుంటున్నారు.

- 8లో ▸



స్మార్ట్‌చెక్‌-42 సర్వే..

రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల్లో లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు నడుంబిగించింది. స్మార్ట్ చెక్‌-42 సర్వే చేపట్టింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.5 /23.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత తగ్గవచ్చు, అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

బాధ్యతలు స్వీకరించిన జైలు సూపరింటెండెంట్‌



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ జిల్లా సెంట్రల్‌ జైలు సూపరింటెండెంట్‌గా దశరథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జైలర్‌ నుంచి సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన ఆయన సంగారెడ్డి సబ్‌ జైలుతోపాటు సిద్దిపేట్‌ జైలులో పనిచేశారు. బదిలీలో భాగంగా నిజామాబాద్‌లోని సారంగపూర్‌ జైలుకు వచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌, బోధన్‌లోని రెండు బార్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కొమ్మూరి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు ఫారం-1ఏలో దరఖాస్తు పత్రం, మూడు కలర్‌ ఫొటోలు, రూ.లక్ష డీడీ లేదా చలాన్‌(తిరిగి ఇవ్వబడదు), ఆధార్‌కార్డు, పాన్‌కార్డులను జిరాక్స్‌లతో జూన్‌ 6లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయంలో దరఖాస్తులు గురువారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. ఒకరు ఎన్నిసార్లయినా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. జూన్‌ 13న కలెక్టర్‌ సమక్షంలో బార్‌లకు లక్కీ డ్రా తీయబడుతుందని తెలిపారు.

రసాయనిక ఎరువులు విరివిగా వాడొద్దు

మాక్లూర్‌: పంట పొలాలకు పురుగు ఉధృతి ఎక్కువైనప్పుడు మాత్రమే రసాయనిక ఎరువులు వాడుకోవాలని రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎం సాయిచరణ్‌ సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా గురువారం మాక్లూర్‌ మండల కేంద్రంలోని రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సాయిచరణ్‌ మాట్లాడుతూ పంట పొలాలను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు రైతులు రసాయనిక ఎరువులపైనే ఆధారపడుతుండడం శోచనీయమన్నారు. లింగాకర్షక బుట్టలు పెట్టుకుంటే అత్యధిక పురుగులు అందులో చిక్కుకొని మృతి చెందుతాయన్నారు. పుష్కలంగా సాగునీరుందని చెప్పి అస్తమానం పొలాలకు నీరందించడం కూడా సరైన పద్ధతి కాదని అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఎం ప్రశాంతి సూచించారు. తప్పనిసరిగా వేసవి దుక్కులు దున్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి పద్మ, పశువైద్యాధికారి ఉమాసహేర్‌, విత్తనాధికారి ఏ అశోక్‌, నిజామాబాద్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ ఎస్‌ వెంకటేశ్వర్‌రావు, మాక్లూర్‌ విండో చైర్మన్‌ బూరోల్ల అశోక్‌, రవి ప్రకాశ్‌, మహేందర్‌, అమూల్య, ఉమాదేవి, దివ్య, రాజునాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

మీరేం చేస్తున్నారు?

- 'విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో హాజరు..'పై మండిపాటు
- జిల్లా వైద్యాధికారులపై డీహెచ్‌ ఫైర్‌
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

నిజామాబాద్‌నాగారం: 'విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో హాజరు..' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనంపై డైరెక్టర్‌ ఆఫ్‌ హెల్త్‌ అధికారులు స్పందించారు. జిల్లాలో మెడికల్‌ ఆఫీసర్ల పనితీరు, కిందిస్థాయి ఉద్యోగులు విధులకు రాకపోయినా హాజరు వేయడంతో జిల్లా అధికారిపై మండిపడ్డారు. పర్యవేక్షించాల్సిన డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ఎంహెచ్‌వోలు ఏం చేస్తున్నారని ఆరా తీశారు. జిల్లాలోని ఆయా మెడికల్‌ ఆఫీసర్ల పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్‌ కేంద్రాలు, సబ్‌ సెంటర్లపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటే తప్పిదాలు జరగకుండా ఉండేవని మండిపడ్డారు. సంబంధిత డిప్యూటీ డీఎంహెచ్‌వోలు పక్కాగా పరిశీలిస్తే ఇలాంటి ఘటనలు జరగవన్నారు. మెడికల్‌ ఆఫీసర్ల పనితీరు, కిందిస్థాయి సిబ్బంది ఏవిధంగా విధులు నిర్వహిస్తున్నారో తెలుసుకోవడానికి ప్రత్యేకంగా మానిటరింగ్‌ చేయాలని డీహెచ్‌ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీకి డీహెచ్‌ ఆదేశాలు జారీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్‌..



నిజామాబాద్‌ జట్టు సభ్యులతో సీపీ సాయిచైతన్య, డాక్టర్‌ కవితారెడ్డి, నుడా చైర్మన్‌ కేశవేణు, రాజేంద్రప్రసాద్‌, రత్నాకర్‌, రాష్ట్ర ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ సభ్యులు



పోటీలను ప్రారంభిస్తున్న సీపీ సాయిచైతన్య

జిల్లా క్రీడాకారులు భేష్‌..

- సామ్య జాతీయ జట్టుకు ఆడటం గర్వకారణం
- పోలీసు కమిషనర్‌ సాయి చైతన్య
- ఉమెన్స్‌ ఫుట్‌బాల్‌ లీగ్‌ టోర్నీ ప్రారంభం

నిజామాబాద్‌ నాగారం : క్రీడల్లో నిజామాబాద్‌ జిల్లా ముందువరుసలో ఉందని, చదువుతోపాటు క్రీడలు సైతం ప్రధానమేనని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. గుగులోత్‌ సౌమ్య ఫుట్‌బాల్‌ క్రీడలో జాతీయస్థాయికి ఎదగడంతో జిల్లాకు మరింత కీర్తి వచ్చిందని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉమెన్స్‌ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన ఉమెన్స్‌ ఫుట్‌బాల్‌ లీగ్‌ టోర్నమెంట్‌ను గురువారం సీపీ సాయి చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్‌ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగాలంటే ఆటలు చాలా ముఖ్యమన్నారు. శారీరక ధృడత్వం ఉంటే ఏదైనా సాధించవచ్చని, ఆరోగ్యమే మహాభాగ్యమన్న సామెతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఫుట్‌బాల్‌ క్రీడ సమాజంలో తోటివారితో ఎలా మెలగాలి అనేది నేర్పుతుందన్నారు. ఆటలో గెలుపు, ఓటములు సహజమని, గెలుపు కంటే పాల్గొనడమే ప్రాధాన్యమన్నారు. క్రీడా పోటీలు నిర్వహించడంతో క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. టోర్నీ నిర్వహించిన డాక్టర్‌ కవితారెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నీలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్‌ కవితారెడ్డి, నుడా చైర్మన్‌ కేశవేణు, రాజేంద్రప్రసాద్‌, రత్నాకర్‌, రాష్ట్ర ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా?

ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌ గడువు ముగిసింది. దీంతో కొత్తగా ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌ జారీ కోసం సామర్థ్య పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులను తరలించే వాహనాల సామర్థ్యం ఎంత మేరకు ఉందో రవాణా శాఖ అధికారులు తేల్చనున్నారు.

- జిల్లాలో 776 స్కూల్‌ బస్సులు
- ఫిట్‌నెస్‌ పరీక్షలు ప్రారంభం
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు :డీటీవో



ఖలీల్‌వాడి: జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు చాలా మంది బస్సులు, వ్యాన్‌లలో ప్రయాణిస్తుంటారు. పిల్లలను ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి భద్రంగా తీసుకెళ్లే వాహనాలు ఫిట్‌గా ఉండాలి. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కాలం చెల్లిన బస్సులను రోడ్లపై తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. విద్యార్థుల ప్రవేశాలపై చూపుతున్న శ్రద్ధ బస్సుల సామర్థ్య పరీక్షలపై చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాల, కళాశాలలకు సుమారు 776 బస్సులున్నాయి. గురువారం నుంచి స్కూల్‌ బస్సులు, వ్యాన్‌లకు కొత్తగా ఫిట్‌నెస్‌ పరీక్షలు చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది.

మరమ్మతులు చేయిస్తారా?

ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు ఉండడంతో స్కూల్‌ బస్సులు మూలనపడ్డాయి. చాలా బస్సుల్లో చినిగిన సీట్లు, పగిలిన అద్దాలు, అరిగిన టైర్లు దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బడి బస్సులను ముందస్తుగా సిద్ధం చేసుకోవాల్సిన ప్రైవేట్‌ యాజమాన్యాలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే లోపు విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలకు ఫిట్‌నెస్‌ పరీక్షలు తప్పనిసరిగా చేయించాల్సి ఉంటుంది. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బస్సులు, వ్యాన్‌లకు మరమ్మతులు చేయించి, ఫిట్‌నెస్‌ పరీక్షలకు పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్‌ ఉన్న వాహనాలే రోడ్లపైకి వచ్చేలా రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

నిబంధనలు ఇవే..

స్కూల్‌ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. బస్సు సీట్లు, అద్దాలు, టైర్లు, తదితర అన్ని సక్రమంగా ఉన్నాయా? లేదా ? అనేది చూసుకోవాలి. డ్రైవర్‌కు 60 ఏండ్లు మించొద్దు. ఫిట్‌నెస్‌తో పాటు ఇన్సూరెన్స్‌ ఉండాలి. బస్సులో ప్రయాణించే విద్యార్థుల జాబితాను ప్రదర్శించాలి. బస్సును 15 ఏళ్లకు మించి నడపొద్దు.

ఆటోల పరిస్థితి ఏంటి?

గ్రామీణ ప్రాంతాల్లో చాలా ప్రైవేటు స్కూళ్లు విద్యార్థులను తరలించేందుకు ఆటోలను ఉపయోగిస్తున్నాయి. సామర్థ్యానికి మించి తరలిస్తూ విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు. ఆటో డ్రైవర్‌కు ఇరువైపులా ఉండే సీట్లలో విద్యార్థులను కూర్చోపెట్టుకొని నడుపుతుండగా బోల్తాపడిన ఘటనలు చాలా ఉన్నాయి.

ఫిట్‌నెస్‌ లేని బస్సులను సీజ్‌ చేస్తాం

ప్రైవేట్‌ స్కూల్‌ యాజమాన్యాలు బస్సులకు ఫిట్‌నెస్‌ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. పాఠశాలల ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. ఫిట్‌నెస్‌ లేని బస్సులు రోడ్లపైకి వస్తే సీజ్‌ చేస్తాం. డ్రైవర్లు,యాజమాన్యాలకు అవగాహన కల్పించాం.

–ఉమామహేశ్వర్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి

ఆట ఆడుకుంటున్నారు

- క్రీడా సంఘాల్లో కుమ్ములాట
- జిల్లాలో రెండేసి చొప్పున ఏర్పాటు
- గుర్తింపు ఉన్న క్రీడా సంఘాలు ఏవీ?
- అయోమయంలో క్రీడాకారులు
- కొరవడిన ఒలింపిక్‌ సంఘం పర్యవేక్షణ

నిజామాబాద్‌ నాగారం : జిల్లాలోని క్రీడా సంఘాల్లో కుమ్ములాట జరుగుతోంది. సంఘాల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా తయారైంది. ఒక్కో క్రీడా విభాగానికి రెండు సంఘాల చొప్పున పుట్టుకొస్తున్నాయి. ఏ సంఘానికి గుర్తింపు ఉందో కూడా చెప్పలేని పరిస్థితిలో క్రీడాధికారులు, ఒలింపిక్‌ సంఘం ప్రతినిధులు ఉన్నారు. గుర్తింపు లేని సంఘం నిర్వహించే పోటీల్లో పాల్గొని వారిచ్చే సర్టిఫికెట్లతో భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయా క్రీడా సంఘాల నిర్వాహకులు పోటీలు నిర్వహిస్తూ తమకు అనుకూలంగా ఉండే వారిని జిల్లా, రాష్ట్రస్థాయికి పంపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

రెండేసీ సంఘాలతో ఇబ్బంది..

జిల్లాలో 42 క్రీడా సంఘాలున్నాయి. ఇందులో కబడ్డీ, హ్యాండ్‌బ్యాల్‌, ఉషు, తైక్వాండో, యోగా, సెపక్‌ తక్రా తదితర క్రీడా సంఘాలు రెండేసి చొప్పున ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఒక్కో క్రీడకు ఒక్క యూనియన్‌ మాత్రమే ఉండాలి. జిల్లాలో యూనియన్లలో ఉన్న సభ్యుల మధ్య గొడవలు రావడంతో ప్రత్యేకంగా సంఘాలను ఏర్పాటు చేసుకొని జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి క్రీడాకారులను తీసుకెళుతున్నారు.

స్పోర్ట్స్‌ కోటాపై ప్రభావం..

అంతర్గత రాజకీయాల కారణంగా కొన్ని సంఘాలకు రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ, ఒలింపిక్‌ అసోసియేషన్‌ అనుమతి లేకపోవడంతో క్రీడాకారులు నష్టపోయే ప్రమాదం ఉంది. క్రీడాకారులు ఉన్నత చదువులకు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం స్పోర్ట్స్‌ కోటా సర్టిఫికెట్‌తో దరఖాస్తులు చేసుకుంటారు. గుర్తింపులేని సంఘానికి సంబంధించిన సర్టిఫికెట్‌ ఉందని ఎవరైనా ఫిర్యాదు చేసినా, రెండేసి సంఘాల కుమ్ములాట జరుగుతున్న విషయం తెలిసినా ఉన్నత చదువుల్లో వచ్చిన సీటు పోతుంది. ఉద్యోగాలు కూడా రాని పరిస్థితి ఏర్పడుతుంది.

కాడి వదిలేసిన..

క్రీడా సంఘాలకు, ప్రభుత్వానికి వారధిలా ఉండాల్సిన ఒలింపిక్‌ అసోసియేషన్‌ కాడి వదిలేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి క్రీడా సంఘాలన్నీ ఒలింపిక్‌ అసోసియేషన్‌ పరిధిలోనే ఉండాలి. వీరి పర్యవేక్షణలోనే టోర్నీలు, ఎంపికలు నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో అసలైన క్రీడా సంఘాలు ఏవో బహిర్గతం చేసి క్రీడాకారులకు అవగాహన కల్పించాల్సిన ఒలింపిక్‌ అసోసియేషన్‌ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేసి సంఘాల సంస్కృతికి చెక్‌ పెట్టాలని క్రీడా సంఘాల నాయకులు, సీనియర్‌ క్రీడాకారులు కోరుతున్నారు.

బోగస్‌ సంఘాలు టోర్నీలు నిర్వహించొద్దు..

బోగస్‌ సంఘాలు ఏర్పాటు చేసుకొని క్రీడాకారులను ఎంపికలు చేసి రాష్ట్రస్థాయికి పంపినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. రాష్ట్రస్థాయి టోర్నీకి వెళ్లే జట్లకు కోచ్‌లుగా సీనియర్‌ వ్యాయామ ఉపాధ్యాయులను మాత్రమే పంపాలి. కొన్ని రాష్ట్ర క్రీడా సంఘాలతో జిల్లా సంఘాలకు విభేదాలున్నాయి.

– బొబ్బిలి నర్సయ్య, ఒలింపిక్‌ అసోసియేషన్‌, జిల్లా కార్యదర్శి

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల ఆకస్మిక పరిశీలన



శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ హనుమంతు

నిజామాబాద్‌ అర్బన్‌ : శిక్షణా తరగతులను చక్కగా ఆకళింపు చేసుకొని, నేర్చుకున్న అంశాలను తరగతి గదులలో పాటిస్తూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను బోధించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌లో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో కరిక్యులర్‌ అండ్‌ థెరపిక్‌ స్ట్రాటజీస్‌ ఫర్‌ సీడబ్ల్యూఎస్‌ఎన్‌ (చైల్డ్‌ విత్‌ స్పెషల్‌ నీడ్‌) అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్‌ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చే దిశగా ఉపాధ్యాయులకు తర్ఫీదునిస్తున్న తీరును పరిశీలించారు. ప్రత్యేకించి గణితం, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్న అంశాలపై స్టేట్‌ రీసోర్స్‌ పర్సన్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను సొంత బిడ్డలుగా భావిస్తూ, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కలెక్టర్‌ సూచించారు.

ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. కలెక్టర్‌ వెంట డీఈవో అశోక్‌, ఇతర అధికారులున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌




సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌, మాట్లాడుతున్న డీఐఈవో

నిజామాబాద్‌ అర్బన్‌ : ఇంటర్మీడియట్‌ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్‌ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 27 వరకు ఇంటర్‌ మొదటి సంవత్సరం పరీక్షలు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, రెండో సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 18,837 మంది విద్యార్థులు హాజరుకానుండగా, 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సుల సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్‌ ఆదేశించారు. విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారికి సూచించారు. సకాలంలో ప్రశ్నపత్రాలు పరీక్ష కేంద్రాలకు చేరేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు ముందుగానే తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షలు సజావుగా కొనసాగేలా అందరూ సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్‌ సెంటర్లను మూసి వేయించాలని, 144 సెక్షన్‌ అమలు చేయాలని, పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌ మాట్లాడుతూ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ఆరుగురు సిట్టింగ్‌ స్క్వాడ్‌, రెండు ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలను నియమిస్తున్నామన్నారు. మొత్తం 36 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు, కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తామన్నారు. సమావేశంలో డీఈవో, ట్రాన్స్‌కో, పోస్టల్‌, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, అదనపు పోలీసు కమిషనర్‌ బస్వారెడ్డి, ఇంటర్‌ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా.. రైతులకు అండగా..

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- ముందస్తు పంటల సాగుకు అనుకూలం



కాకతీయ కాలువలో వ్యవసాయ పంపుసెట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ వేసవిలో సైతం నిండుకుండలా ఉంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువలో నీరు నిలువ ఉండటంతో ఇరువైపులా ఉన్న రైతుల భూముల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటున్నాయి. కొందరు రైతులు కాలువలో పంపుసెట్‌లను బిగించుకొని పంటల సాగుకు ఉపయోగిస్తున్నారు.

50 క్యూసెక్కులకు జీవో

కాకతీయ కాలువ నిర్మాణ సమయంలో ఆయా గ్రామాల రైతులు ఊర చెరువులను కోల్పోయారు. దీంతో నీటిని నిలువ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కాలువలోనే నీటిని నిలువ చేసేలా ప్రత్యేక జీవోను ఆయకట్టు రైతులు సాధించుకున్నారు. 2017లో లీకేజీ నీటి కోసం రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. దీంతో దిగి వచ్చిన ప్రభుత్వం నీటి నిలువ కోసం అవకాశం కల్పించింది. జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌ గ్రామం వద్ద కాకతీయ కాలువ క్రాస్‌ రెగ్యులేటర్‌ను దించి కాలువలో నీటి నిలువ చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల లేని సమయంలో కాలువలో నీటి నిలువ కోసం ప్రతి రోజు 50 క్యూసెక్కుల నీటిని నిరంతరం విడుదల చేపట్టాలని ప్రత్యేక జీవోను గత ప్రభుత్వం ఇచ్చింది. అప్పటి నుంచి కాలువలో నీరు నిలువ ఉంటోంది.

కాలువ నుంచి పైప్‌లైన్లు..

కాకతీయ కాలువ నుంచి కొందరు రైతులు ఏకంగా 4 నుంచి 5 కిలోమీటర్ల దూరం వరకు కూడా పైపులైన్‌ వేశారు. కాలువలో నీరు నిలువ ఉండటంతో ప్రస్తుతం ముందస్తుగా పంటలు సాగు చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం కాలువలో నీటిని నిలువ ఉంచేందుకు చర్యలు తీసుకోవడంపై రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఎల్లప్పుడూ నీరు..

కాకతీయ కాలువలో ఎండకాలంలో సైతం నీరు నిలువ ఉంటుండడంతో పంటల సాగుకు ఇబ్బంది లేదు. కాలువ నీటి ఆధారంగా పంపుసెట్‌ బిగించి పైపులైన్‌ వేశాను. ఖరీఫ్‌ పంటలను ముందుగా సాగు చేసేందుకు రెడీ అవుతున్నా. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఆకుల రాజన్న, రైతు

మొదలైన జీలుగ పంపిణీ

దొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లా వ్యాప్తంగా జీలుగ విత్తనాల పంపిణీ మొదలైంది. ఇప్పటి వరకు జిల్లాకు ఆరువేల క్వింటాళ్ల వరకు దిగుమతి చేసుకున్న అధికారులు, అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గోదాములకు సరఫరా చేశారు. సొసైటీల్లో విత్తనాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసిన అధికారులు రైతుల నుంచి పట్టాపాసు బుక్కుల జిరాక్సులను తీసుకొని జీలుగను అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 400 క్వింటాళ్లు పంపిణీ చేశామని, జీలుగ కొరత ఏ మాత్రం లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి తెలిపారు.

ఈ-పాస్‌ డివైస్‌ల పంపిణీ...

ప్రభుత్వం ఈ-పాస్‌ డివైస్‌లను మార్చింది. అప్‌డేట్‌ వెర్షన్‌ కలిగిన ఎల్‌-1 డివైస్‌లు వాడాలని సొసైటీలు, ప్రైవేటు డీలర్లకు సూచించింది. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులు లేటెస్ట్‌ డివైస్‌లను డీలర్లకు అందజేశారు. ఇక నుంచి వీటి ద్వారానే రైతులకు ఎరువులు, విత్తనాలను అందజేయాలని డీఏవో వీరాస్వామి సూచించారు.



దొంకేశ్వర్‌లో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న సొసైటీ ప్రతినిధులు

సీడ్ మక్కవైపే మొగ్గు

- పసుపు పంటలో అంతర్‌పంటగా సాగుచేస్తున్న రైతులు
- క్వింటాల్‌కు రూ.2000 చెల్లించేలా రైతులతో వ్యాపారుల ఒప్పందం

బాల్కొండ: పసుపు పంటలో అంతర్‌పంటగా సాగు చేసే మక్క పంటలో రైతులు సీడ్ మక్కల వైపే మొగ్గు చూపుతున్నారు. పసుపు పంటలో అంతర్ పంటగా రైతులు మక్క పంటను సాగు చేస్తారు. సీడ్ మక్క పంట ఎక్కువ ఎత్తుగా పెరగదు. అంతే కాకుండ పసుపు పంటకు గాలి, సూర్యరశ్మి అందడంతో ఎలాంటి అడ్డంకి ఉండదు. దీంతో రైతులు సీడ్ మక్కల వైపే మొగ్గు చూపుతున్నారు. రైతులు సాగు చేసే సీడ్ పంటనే మళ్లీ తరువాత పంటకు వ్యాపారులు విత్తనాలుగా మార్చి అందిస్తారు. దీంతో రైతులు సీడ్ మక్కల వైపే మొగ్గు చూపుతున్నారు.

సీడ్ కంపెనీ వ్యాపారుల ఒప్పందాలు

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సీడ్ వ్యాపారులు పల్లెల్లో రైతులతో మక్క పంట ఒప్పందాలను చేసుకుంటున్నారు. తాజాగా గురువారం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో మక్క పంటకు చెందిన ఓ సీడ్ కంపెనీ వ్యాపారి రైతులతో ఒప్పందం చేసుకున్నాడు. క్వింటాల్‌కు రూ. 2 వేలు చెల్లించుటకు ఒప్పందం కుదిరింది. విత్తనాలను వారే సరఫరా చేసి పంట దిగుబడిని కూడ వారే కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ రకం మక్క విత్తనాలను కేవలం పసుపు పంటలో మాత్రమే అంతర్ పంటగా సాగు చేయాలని పేర్కొన్నారు. ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా, రాకపోయినా వ్యాపారి రైతులకు చెల్లించాలి. అదనంగా వస్తే అదనంగా చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారు. మక్క పంట దిగుబడి వచ్చిన తరువాత మక్క పంట కంకుల బూరు తొలిగించి ఇవ్వాలని అన్నారు. కంపెనీ నిబంధనాల ప్రకారం పంట సాగు చేపట్టాలి. పంట దిగుబడి వ్యాపారికి అందించిన 10 రోజుల తరువాత రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తారు. ఈక్రమంలో రైతులు సీడ్ మక్క సాగువైపే ఆసక్తి చూపుతున్నారు.


మక్క కంకులు

సీడ్ మక్కలే సాగు చేస్తా..

పసుపు పంటలో సీడ్ మక్కలనే సాగు చేస్తాను. సీడ్ మక్కల కర్ర ఎక్కువగా పెరగదు. దీంతో పసుపు పంటకు ఇబ్బంది ఉండదు. ధర కూడ బాగానే చెల్లిస్తున్నారు. ఎకరానికి రూ. 30 వేల ఆదాయం వస్తుంది.

– తలారి గాబ్రియెల్, రైతు

మారుతున్న కాలంతోపాటు టీచర్లు అప్డేట్ కావాలి

- ఉమ్మడి జిల్లా డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కామారెడ్డి రూరల్: మారుతున్న కాలంతోపాటు ఉపాధ్యాయులు అప్డేట్ కావాలని నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సూచించారు. గురువారం కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని జెడ్పీహెచ్ ఎస్‌లో నిర్వహిస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు ఏ డిజిటల్ ఉపకరణం కాదని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంచాలని, సామాజిక సర్దుబాటులు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి మండల విద్యాధికారి వై. ఎల్లయ్య, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డా. సుభాష్, డీఆర్పీలు ప్రసూన్, బాలరాజ్, రాజభైరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పార్టీ ఐక్యత కోసం కలిసి పనిచేయాలి

రాజంపేట : మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ఉండరాదని అందరూ పార్టీ కోసం ఐక్యతతో పని చేయాలని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజంపేట గ్రామంలో నెలకొన్న ఇందిరమ్మ ఇళ్ల గందరగోళ విషయంపై ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరు డబ్బులు వసూలు చేసినట్లు నిరూపణ జరిగినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నాయకత్వంలో పార్టీ కోసం కష్టపడి పని చేయాలని, రాబోయే స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాదవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తాం



నిజామాబాద్ అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణను యధావిధిగా చేపడుతామని టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ అన్నారు. నగరంలోని టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ వేసిందని, ఇది మొదటి విజయంగా భావిస్తున్నామన్నారు. ఆపరేషన్ సిందూర్ వలన ఉద్యమ కార్యాచరణ ఉన్నప్పటికీ వాయిదా వేశామన్నారు. కానీ మళ్లీ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా సహ అధ్యక్షుడు పెద్దల నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, కోశాధికారి దినేష్ బాబు, ముఖ్య సలహాదారులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న స్మార్ట్‌చెక్-42 సర్వే


ఆర్మూర్ డివిజన్ పరిధిలో చిన్నారుల వివరాలను నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్


చిన్నారుల వివరాలను సేకరిస్తున్న సిబ్బంది

- పుట్టిన బిడ్డ నుంచి 5ఏళ్ల చిన్నారుల వరకు వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- గత నెల 15 నుంచి కొనసాగిన సర్వే

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల్లో లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు నడుంబిగించింది. అందులో భాగంగా గత నెల 15 నుంచి చేపట్టిన స్మార్ట్ చెక్-42 సర్వే శరవేగంగా కొనసాగగా, నేటితో ముగియనుంది. ఎన్ఐఈపీ ఐడీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసెబిలిటీస్) పేరిట స్మార్ట్ చెక్-42 సర్వే ప్రారంభించింది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5సంవత్సరాల లోపు గల చిన్నారుల వరకు ఏమైన లోపాలు ఉన్నాయా? అనే దానిపై మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు సర్వే నిర్వహించారు.

42 ప్రశ్నలు– 8విభాగాలు..

అంగన్‌వాడీ సిబ్బంది తమ అంగన్‌వాడీ పరిధిలోని చిన్నారుల్లో లోపాలను గుర్తించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్‌హెచ్‌టీస్ యాప్‌లో 42 అంశాల కూడిన వాటితో సర్వే చేయిస్తుంది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 5 ఏళ్లలోపు పిల్లలందరిని సర్వే చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ చెక్-42 సర్వేలో మొత్తం 42 ప్రశ్నలు ఉండగా, 8 విభాగాలుగా సర్వే ఫార్మట్‌లను ఏర్పాటు చేశారు. 8 విభాగాల్లో అందులో కొన్ని ప్రశ్నలు చేర్చారు. పాలు తాగడంలో ఇబ్బందులు ఉన్నాయా?, చిన్నారి పుట్టిన వెంటనే ఏడ్చిందా?. లేదా? ఇలా ఒక్కో విభాగంలో చిన్నారుల వయస్సును బట్టి ఎదురయ్యే లోపాలను గుర్తించే విధంగా ప్రశ్నలను తయారు చేశారు. ఆర్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల వారీగా అయిదేళ్లలోపు చిన్నారులపై చేపట్టిన సర్వే నేటితో ముగియనుంది. ఉపాధ్యాయినులు తమ ఫోన్ యాప్‌లో ఎస్, నో, ఇతర వివరాలుంటే వాటిని నమోదు చేస్తున్నారు. ప్రతి చిన్నారికి సంబంధించిన సర్వే వివరాలు న్యూట్రీషనల్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ సర్వర్‌లో నిక్షిప్తం అవుతాయి. సర్వే ఫలితాల ఆధారంగా ఏమైనా లోపాలుంటే, అవసరమైన చికిత్స తదితర చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఈ సర్వే ఏప్రిల్ 15న మొదలై నేటితో ముగియనుంది. ఆర్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 13 సెక్టార్లు మొత్తం 326 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 5 ఏళ్లలోపు 20977 మంది చిన్నారులు ఉన్నారు. ఇప్పటి వరకు స్మార్ట్‌చెక్‌లో 20058మంది చిన్నారుల సర్వే పూర్తియింది.

ప్రతి ఇంటిని సర్వే చేశాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి అంగన్‌వాడీ టీచర్లు వెళ్లి వివరాలను సేకరించారు. ప్రతి ప్రశ్నను అడిగి, వివరాలు తెలుసుకొని న్యూట్రీషనల్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ సర్వర్‌లో నమోదు చేశారు.

–భార్గవి, ఐసీడీఎస్ సీడీపీవో, ఆర్మూర్

కేసులను పెండింగ్ లో పెట్టొద్దు..

- ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: పోలీస్ స్టేషన్లకు వచ్చే కేసులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సాయంత్రం జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసులోనూ నాణ్యవంతమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. గంజాయి, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలనీ, అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో సీసీ కెమెరాల ను ఏర్పాటు చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలున్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

ప్రమాదకరంగా ప్రయాణం

రామారెడ్డి : రామారెడ్డి రూట్లో గతంలో కంటే తక్కువ బస్సులు తిరుగుతున్నాయని ప్రయాణికులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బస్సుల్లో ఫుట్ బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.




రామారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తున్న బస్సులో ఫుట్ బోర్డుపై నిలబడిన ప్రయాణికులు

విద్యుత్ షాక్‌తో అసిస్టెంట్ లైన్‌మన్ మృతి

బోధన్ రూరల్: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై అసిస్టెంట్ లైన్‌మన్ మృతి చెందాడు. వివరాలు ఇలా.. ఎడిపల్లి మండల కేంద్రానికి చెందిన బి మహేందర్(34) బోధన్ సబ్‌స్టేషన్ పరిధిలోని బెల్లాల్ ప్రాంతంలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాజీవ్‌నగర్ తండాలో చిన్నపాటి విద్యుత్ మరమ్మతులు ఉండటంతో గురువారం అతడు ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకోకుండా మరమ్మతులు చేపట్టాడు. ఈ క్రమంలో పైనున్న 11 కెవి విద్యుత్ తీగలు తగలడంతో అతడికి తగలడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి, అక్కడి నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. బోధన్ ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్, అధికారులు ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.


మహేందర్ (ఫైల్)

చైన్‌స్నాచింగ్ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య.. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

ఆర్మూర్‌టౌన్: ఆటోలో ప్రయాణించే మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను పట్టుకున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్మూర్ మండలంలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన చైన్ స్నాచింగ్ బాధితురాలు బొబ్బిలి లక్ష్మి ఇటీవల ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బైపాస్ మార్గం వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన ఏడుగురు నిందితులు కూలీ పనుల పేరుతో నిర్మల్ జిల్లాలోని తిమ్మాపూర్, మంజులపూర్ ప్రాంతాల్లో నివసిస్తూ, మహిళల మెడల నుంచి బంగారు గొలుసులు చైన్ స్నాచింగ్ చేసినట్లు నిర్ధారించారు. కాగా వారి వద్ద నుంచి 12.2 తులాల బంగారు ఆభరణాలు, రెండు బైకులు, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముఠాను పట్టుకోవడంలో కృషిచేసి పోలీసులకు రివార్డులను అందజేశారు. సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని బర్థిపూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన యేసుదాస్, మంజుల ఇద్దరు కలిసి గురువారం రాత్రి బైక్‌పై నిజామాబాద్‌కు బయలుదేరారు. బర్థిపూర్ శివారులోని ఫంక్షన్‌హాల్ సమీపంలో వీరి బైక్‌ను ఓ కారు వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడిపోయి గాయపడ్డారు. స్థానికులు వెంటనే గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంజుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సీపీ సాయిచైతన్య సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లోని 63వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఆర్మూర్‌లోని జెండాగల్లీకి చెందిన అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో మరణించగా, కారణాలను ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో పరిస్థితిని పరిశీలించారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, సిబ్బంది ఉన్నారు.

రైల్వే సిబ్బంది గ్రీవెన్స్‌పై 'నేస్తం'



ఖలీల్‌వాడి: రైల్వే సిబ్బంది గ్రీవెన్స్‌పై 'నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్టా అన్నారు. హైదరాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్‌లో గురువారం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో మొదటి నేస్తం ఫిర్యాదుల క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల్లో నమ్మకాన్ని పెంచేందుకు, రైల్వే ఉద్యోగులు పర్సనల్ బ్రాంచ్ అధికారులతో నేరుగా మాట్లాడేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి బృందం రైల్వే సిబ్బంది సమస్యలను గ్రీవెన్స్‌లో అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలు పరిపాలన పరంగా పరిష్కరిస్తామని చెప్పారు.

వ్యవసాయశాఖలో ఘటనపై విచారణకు ఆదేశం

డొంకేశ్వర్(ఆర్మూర్): మరణించిన ఉద్యోగికి సంబంధించిన ఫ్యామిలీ బెనిఫిట్స్ ఇచ్చే విషయంలో ఇబ్బందులు పెడుతున్నారనే ఆరోపణలపై నిజామాబాద్ రూరల్ వ్యవసాయశాఖ అధికారిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ విచారణకు ఆదేశించింది. విచారణ అధికారులుగా సింగారెడ్డి, శివాజీ పాటిల్‌లను హైదరాబాద్ నుంచి నియమించింది. వీరు శుక్రవారం జిల్లాకు వచ్చి బాధిత కుటుంబాన్ని, అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని విచారించనున్నారు. ఇటు టీజీవో ఆధ్వర్యంలో కలెక్టర్, డీఏవోకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

17వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా మే నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే సంబంధిత రేషన్ షాపుల్లో బియ్యం తీసుకోవాలని అధికారులు సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రెంజల్(బోధన్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన సోహైల్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ఆయన ఫిర్యాదు మేరకు ట్రేస్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గురువారం బాధితునికి ఫోన్ అప్పగించినట్లు చెప్పారు. కంప్యూటర్ ఆపరేటర్ గణేశ్ ఉన్నారు.

క్రైం కార్నర్

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

- ఇందిరమ్మ ఇల్లు రాలేదని నిరసన
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీతో దిగివచ్చిన వ్యక్తి

నిజామాబాద్ రూరల్: అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేస్తూ, సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. వివరాలు ఇలా.. మండలంలోని మల్లారం గ్రామనికి చెందిన ఎం. సాయిలు అనే వ్యక్తి ఇందిరమ్మ ఇల్లుకు అర్హత ఉందని, ఇటీవల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాడు. కానీ అధికారులు అనర్హతగా ప్రకటించడంతో గురువారం అతడు మల్లారం గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈ విషయంపై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన ఫోన్లో అక్కడ ఉన్న స్థానిక నాయకులతో మాట్లాడి సెల్ టవర్ ఎక్కిన సాయిలుకు కాన్ఫరెన్స్ ద్వారా ఫోన్‌లో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన సెల్‌టవర్ దిగి ఎమ్మెల్యే భూపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సాయిలు సెల్‌టవర్ దిగడంతో మల్లారం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



నగరంలో సైబర్ మోసం

- లింక్ ఓపెన్ చేసి, రూ.1.48లక్షలు పోగొట్టుకున్న రిటైర్డ్ ఉద్యోగి

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ మోసగాళ్లు రూ.1.48 లక్షలు కాజేశారు. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపిన వివరాలు ఇలా.. రిటైర్డ్ ఉద్యోగి ఇటీవల ఫోన్‌పే పని చేయకపోవడంతో బ్యాంక్ అధికారులను సంప్రదించారు. దీంతో బ్యాంక్ సిబ్బంది గూగుల్‌పే లేదా ఫోన్‌పే కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈక్రమంలో సదరు వ్యక్తి గూగుల్‌లో సెర్చ్ చేసి ఓ ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. అనంతరం వేరే ఫోన్ నెంబర్ నుంచి సైబర్ మోసగాళ్లు కాల్ చేసి ఓ లింక్ పంపిస్తున్నామని చెప్పి పంపించారు. వెంటనే అతడు లింక్ ఓపెన్ చేయడంతో బాధితుడికి ఉన్న యూనియన్‌బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, పంజాబ్‌నేషనల్ బ్యాంక్‌ల ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.48 లక్షలను కాజేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి



నాగిరెడ్డిపేట (ఎల్లారెడ్డి): మండలంలోని జలాల్‌పూర్ గ్రామశివారులో గురువారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మేక మృత్యువాత పడింది. మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన చిన్నన్న అంజయ్య రోజూలాగే గురువారం తన మేకల మందను తీసుకొని మేతకోసం జలాల్‌పూర్ శివారుకు వెళ్లాడు. కాగా ఇటీవల కురిసిన గాలివానకు జలాల్‌పూర్ శివారులో విద్యుత్‌స్తంభం నుంచి విద్యుత్‌వైరు ఊడిపోయి కిందపడింది. కిందపడిన వైరును గమనించక మేకలమంద అటువైపు వెళ్లగా మందలోని ఓ మేక ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. ప్రమాదంలో మృతిచెందిన మేక విలువ సుమారు రూ.10వేల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కాగా విద్యుత్‌వైరు నేలపై పడిన వైపు మనుషులెవరూ వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు, పశువైద్య సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగినతీరును తెలుసుకున్నారు.

కొడుకుపై కత్తితో తండ్రి దాడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మద్యం మత్తులో కన్న కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన ఘటన లింగంపేట మండలం కోమట్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఈకల సంగయ్య మద్యం మత్తులో బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. భార్య శ్యామవ్వ, పెద్ద కుమారుడు కుమార్, చిన్న కుమారుడు అఖిల్, తండ్రి సంగయ్యల మధ్య గొడవ జరిగింది. పెద్ద కుమారుడు కుమార్ తండ్రికి వ్యతిరేకంగా మాట్లాడడంతో అతడిపై తండ్రి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో కుమార్‌కు వీపు, మెడ భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం లింగంపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఎస్సై వెంకట్రావును ఫోన్‌లో సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

గృహహింస కేసులో భర్తకు మూడేళ్ల జైలు

రెంజల్(బోధన్): భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడంతోపాటు విడాకులు ఇవ్వకుండానే రెండో వివాహం చేసుకున్న భర్తకు బోధన్ కోర్టు 3ఏళ్ల జైలుతోపాటు రూ.1500 జరిమానా విధించినట్లు రెంజల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వివరాలు ఇలా.. బోధన్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన బందారు సుభాష్ అనే యువకుడికి, రెంజల్ మండలం పేపర్‌మిల్ గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే యువతితో 2012లో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాలకు దంపతులకు అబ్బాయి పుట్టాడు. అప్పటినుంచి భర్త అదనపు కట్నం కోసం భార్యను వేధించడం ప్రారంభించాడు. శారీరకంగా, మానసికంగా హింసించడంతోపాటు రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో అతడి బాధలు భరించలేక 2016లో బాధితురాలు రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారించిన బోధన్ కోర్టు అదనపు న్యాయమూర్తి గురువారం శిక్ష విధించినట్లు చెప్పారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం తాగి వాహనాలు నడిపిన 32 మంది పట్టుబడ్డారు. వీరికి ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపరచగా 27 మందికి రూ.38500 జరిమానా విధించారు. అలాగే ఇద్దరికి ఒక రోజు, ముగ్గురికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సిరికొండ: మండలంలోని కొండాపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎమ్మార్ఐ గంగరాజం గురువారం పట్టుకొని పంచనామా చేసి పోలీసులకు అప్పగించారని ఎస్సై రామ్ తెలిపారు. కొండాపూర్‌కు చెందిన ట్రాక్టర్ యాజమాని మామిడి నర్సయ్య, డ్రైవర్ రామకృష్ణ, మెట్టుమర్రి తండాకు చెందిన మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.